## మినీకథ

# మొదటి కేసు



అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ కొట్టి వెనుదిరిగాడు పోలీస్ వెంకటస్వామి.

"డ్యూటీలో చేరి నెలరోజులు కావస్తుంది. ఒక్క కేసయినా పట్టుకరాలేదు. యూస్‌లెస్" అన్న ఎస్.ఐ. మాటలు శూలాల్లా గుండెల్లో గుచ్చుతున్నాయి. ఎలాగైనా సాయంత్రంలోగా ఒక్క కేసైనా పట్టుకరావాలి అనుకున్నాడు మనసులో.

వెంకటస్వామి బస్టాండ్ వద్ద పిక్‌పాకెటర్స్ కోసం కాపు కాశాడు. ప్రయోజనం లేకపోయింది.

మ్యాట్నీషో వద్ద టికెట్స్ బ్లాకులో అమ్మే ఏబ్రాసీ వెధవల్ని ఒడుపుగా పట్టుకోవాలని చూశాడు. లాఘవంగా తప్పించుకెళ్లారు.

సుబ్బులు కంపెనీ కెళ్లాడు. స్టేషన్ కీడ్చుకెళ్లేందుకు ఒక్క పిట్టయినా దొరక్క పోదా అని.

సుబ్బులు సుతారంగా నవ్వి అంది. "ఎంకటేశయ్యా! ఈ నెల కివ్వాల్సిన ముడుపు ఇంతకు ముందే హెడ్డుగారు పట్టుకెళ్లారులే! పాసింజర్లు వచ్చేవేళ, ఊరకే గొడవచేయకు" దాని మాటల్లో నిజముందో లేదో తన కర్థంకాక, ఈ వ్యవహారం కొత్త గనక మౌనంగా బయటకెళ్లాడు.

నిరాశతో కాళ్లీడ్చుకుంటూ వెళ్తున్న వెంకటస్వామి బుర్రలో సీత మెరువులు కదిలి తళుక్కుమంది.

కళ్లకు గాగుల్స్ పెట్టుకుని రెండు జడలు ముందుకేసుకుని, రోజుకో డ్రస్ మారుస్తూ కాలేజ్ కెళ్లేందుకన్నట్లుగా స్టైల్‌గా పుస్తకాలెట్టుకుని, బస్‌స్టాప్‌లో నిల్చుని బేరం దొరికితే తన గదికి తీసుకెళ్లే సీత అతని ఆలోచనలకు ఓ రూపాన్ని కల్పించింది. డ్యూటీలో చేరిన మొదట్లోనే సీతను పోలీస్ స్టేషన్‌కు లాక్కెళ్లాలనుకున్నాడు. అయితే సందేహం తన్నేకుటువు కుదిపింది. ఏ పుట్టలో ఏ పాముందో, క్లాస్ లేడీ... తన ఉద్యోగానికి ఎసరు పెడ్తుందేమో. అన్న భయంతో వెనక్కు తగ్గాడు.

ఈ రోజు ఎస్.ఐ. చేసిన ఇన్‌సల్ట్‌కు వెంకటస్వామికి ఎక్కడలేని తెగింపు పుట్టుకొచ్చింది. సీతగది కెళ్లి తలుపు తట్టాడు. తలుపు ఓరగా తీసి నిల్చున్న సీతను త్రోసుకుంటూ లోనికెళ్లాడు. "లోన గదిలో ఎవడున్నాడహే" సీత సమాధానం కోసం ఆగకుండా కర్టన్ తొలగించి లోనికెళ్లాడు. సోఫాసెట్‌లో అటువైపు తిరిగి కూర్చుని సిగరెట్ కాల్చుకుంటున్న వ్యక్తి దగ్గరకెళ్లి, షాక్కా కాలర్‌ని వెనకనించి పట్టుకొని "లెగురా ఈడియట్! నిన్నూ దాన్ని అరెస్ట్ చేస్తున్నాను. స్టేషన్‌కెళ్దాం పద" అన్నాడు. సోఫాసెట్‌లో కూర్చున్న వ్యక్తి లేచి నిల్చుని వెంకటస్వామివైపు తిరిగాడు. వెంకటస్వామి చేతిలోని లాఠి కర్ర క్రిందపడింది. అటెన్షన్‌లో నిలబడి సెల్యూట్ కొట్టి అతి ప్రయత్నం మీద మాటలు కూడబలుక్కుంటూ 'తప్పయిపోయింది. సార్ మీరుంటారని ఎరక్క వచ్చాను' అంటూ ఎంత వేగంగా వచ్చాడో అంత వేగంగా వెనుదిరిగి వెళ్లాడు.

ఆ తర్వాత ఎస్.ఐ. వెంకటస్వామి కేసులు పట్టుకు రమ్మని మునుపటిలాగా వేధించుకుతినలేదు.

-సి.యం.రామకృష్ణారెడ్డి.




